సర్కారు బడికి సొబగులు

- అత్తాపూర్ పాఠశాలలో మెరుగైన వసతులు
- రూ. 8 లక్షల వ్యయంతో ఏర్పాట్లు



అత్తాపూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల

అత్తాపూర్: అనుకూలమైన అభ్యాస వాతావరణాన్ని సృష్టించడంలో సహాయపడే సమర్థవంతమైన మౌలిక సదుపాయాలను నిర్మించడం చాలా ముఖ్యమని సర్టికల్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ మేనేజింగ్ డైరెక్టర్ మెల్చియస్ మంగళం ఆంథోని అన్నారు. ప్యూర్ (పీపుల్ ఫర్ అర్బన్ అండ్ రూరల్ ఎడ్యుకేషన్) అనే ఎన్జీవో సంస్థ వ్యవస్థాపకురాలు శైలా తాళ్లూరితో కలిసి అత్తాపూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నూతన వసతులను సోమవారం ప్రారంభించారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కింద పాఠశాలను దత్తత తీసుకొని సౌకర్యాలను మెరుగు పరిచిందన్నారు. మరుగుదొడ్ల నిర్మాణం, విద్యుత్ పరికరాలను అమర్చడం, ఫ్లోరింగ్‌ను ఏర్పాటు చేసింది. కొత్త తలుపులు, కొత్త నీటి ట్యాంకర్‌ను ఏర్పాటు చేసిందన్నారు. భవనానికి రంగులు వేసి పాఠశాలను అందంగా తీర్చిదిద్దారని తెలిపారు. ఈ పనులను రూ. 8 లక్షలను సమకూర్చి పూర్తి చేశామని పేర్కొన్నారు. తమకు మరో రెండు తరగతి గదులు, సిబ్బందికి టాయిలెట్స్ సౌకర్యం, లైబ్రరీ అవసరం ఉందని పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.కృష్ణారెడ్డి వారిని కోరారు. పాఠశాలకు మరింత సహాయాన్ని అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని వారు వివరించారు. కార్యక్రమంలో రేణుక, స్వాతి, రామలక్ష్మి, కిరణ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మంగళం ఆంథోని, శైలా తాళ్లూరి తదితరులు

హిమాయత్‌సాగర్ ఎఫ్‌టీఎల్ పరిధిలో..

కబ్జాల పర్వం!

మట్టితోనే నింపేస్తున్న అక్రమార్కులు • పట్టించుకోని అధికారులు



హిమాయత్‌సాగర్ ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లలో మట్టికుప్పలు



రాళ్లు, మట్టితో బఫర్‌జోన్‌ను చదును చేసిన అక్రమార్కులు

శంషాబాద్: చెరువుల పరిరక్షణపై ప్రభుత్వం సీరియస్‌గా ఉన్నా అక్రమార్కులకు అవేవీ పట్టడం లేదు. ఓవైపు చెరువుల సమీపంలో కబ్జాలపై ఉక్కుపాదం మోపుతున్నా మరోవైపు ఆక్రమణలకు తెగబడుతూనే ఉన్నారు. తాజాగా వారం రోజులుగా కొత్వాల్‌గూడలో ఓ కన్వెన్షన్ సమీపంలో ఉన్న హిమాయత్‌సాగర్ చెరువు భూమిలో అక్రమార్కులు ప్రవేశించారు. పెద్ద ఎత్తున బయటి నుంచి మట్టితో పాటు రాళ్లు తీసుకొచ్చి ఎఫ్‌టీఎల్ పరిధిలో నింపేశారు. ఇప్పటికే కొంత భాగాన్ని చదును చేశారు. మూడు రోజులుగా నీళ్లు నిలిచి ఉన్న చోట కూడా మట్టితో నింపేస్తున్నారు.

రెండు నెలల క్రితమే..

చెరువుకు సమీపంలో సర్వే నంబర్-54లోని కొంతమేర భూములు కోర్టు వివాదంలో ఉన్నాయి. ప్రభుత్వానికి ప్రైవేటు వ్యక్తుల మధ్య నెలకొన్న ఆవివాదం కాస్తా ప్రస్తుతం కోర్టు పరిధిలో నడుస్తోంది. కోర్టు పరిధిలోని భూములు సైతం తమ సొంతానిగా చెప్పుకుంటున్న కొందరు వ్యక్తులు ఇప్పటికే పలు కట్టడాలు చేపట్టడంతో పాటు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లోని స్థలాలను సైతం తమ ఆధీనంలోకి తీసుకుంటున్నారు.

- ఇటీవల బఫర్‌జోన్ పరిధిలో ఉన్న కట్టడాలను రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న మట్టికుప్పలను కూడా తొలగించాల్సిందిగా అధికారులు ఆదేశించారు.
- వాటిని తొలగించకపోగా అదే మట్టితో ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లను పూర్తిగా చదును చేసిన అక్రమార్కులు ఇప్పుడు ఏకంగా నీరు నిలిచి ఉన్న ప్రాంతాన్నే మట్టితో కప్పేసేందుకు ప్రయత్నిస్తున్నారు.
- ఈ విషయమై అధికారులు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాగర్ ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలు నిర్ణయించి ఫెన్సింగ్ వేస్తేనే సమస్య పరిష్కారం అవుతుందని స్థానికులు పేర్కొంటున్నారు.

నేటి నుంచి సీఎం కప్ క్రీడా పోటీలు

బండ్లగూడ: ప్రజాపాలన, ప్రజా విజయోత్సవాలను పురస్కరించుకొని మూడు రోజుల పాటు సీఎం కప్ క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. గండిపేట మండల పరిధిలోని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్, నార్సింగి, మణికొండ మున్సిపాలిటీల పరిధిలోని అన్ని వార్డులలోని యువజన సంఘాల సభ్యులు, పాఠశాలల విద్యార్థులు, కళాశాలల విద్యార్థులు ఈ నెల 10వ తేదీ నుంచి 12వ తేదీ వరకు జరిగే పోటీల్లో పాల్గొనాలని కోరారు. బండ్లగూడలోని డాన్ బాస్కో పాఠశాలలో పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్, యోగా తదితర పోటీలు జరుగుతాయన్నారు. మరింత సమాచారం కోసం అధికారులు ఎస్.జోత్స్న (ఫోన్: 94402 31217), అంజనేయులు(ఫోన్: 88977 22301)ను సంప్రదించాలని కోరారు. మున్సిపాలిటీల్లో నిర్వహించిన సీఎం కప్ పోటీలను విజయవంతం చేయాలని కోరారు.

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

మణికొండ: రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు ఇందిరమ్మ గృహాలకు ప్రజలు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించటం శుభపరిణామని, వాటిని అర్హులకు మాత్రమే కేటాయించాలని బీఆర్ఎస్ పార్టీ మణికొండ మున్సిపల్ శాఖ అధ్యక్షుడు డి.సీతారం, ప్రధాన కార్యదర్శి జి.నరేందర్, కార్యనిర్వాహక అధ్యక్షుడు కె. ధన్‌రాజ్, మహిళా అధ్యక్షురాలు పి.రూపారెడ్డిలు డిమాండ్ చేశారు. లబ్ధిదారుల ఎంపికను పారదర్శకంగా సమావేశం నిర్వహించి అందరికీ తెలిసేలా ఎంపిక చేయాలన్నారు. ఎంపికలో ఎలాంటి వివక్షకు పాల్పడినా తమ పార్టీ తరఫున పోరాటం చేస్తామని హెచ్చరించారు.

రోడ్డు సమస్య పరిష్కరించండి

అత్తాపూర్: రోడ్డు నిర్మాణ పనులను చేపట్టడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పూర్తిగా విఫలం అతున్నారని గోల్డెన్ హైట్స్‌లోని అపార్ట్‌మెంట్‌వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ అపార్ట్‌మెంట్ ప్రాంతంలో 50 ఫీట్ల రోడ్డును ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు మంజూరైనా ఆ పనులను ప్రారంభించడం లేదన్నారు. రోడ్డు పర్మిషన్ కోసం ఎమ్మెల్యే ఇచ్చిన లెటర్‌పై అధికారులకు పలుమార్లు దృష్టికి తీసుకువెళ్లినా ఈ రోడ్డు పనులను చేపట్టక పోవడంలో ఆంతర్యమేమని ప్రశ్నించారు. వర్షాకాలంలో చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నామని... వరద నీరు మొత్తం తమ అపార్ట్‌మెంట్‌లోకి వస్తుందన్నారు. దీంతో అపార్ట్‌మెంట్‌కు ఉన్న గేటును పూర్తిగా వాహకాల రాకపోకలకు నిలిపి వేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి రోడ్డు పనులను చేపట్టి సమస్యను తీర్చాలని కోరుతున్నారు.

స్నేహ బృందం.. అన్నదానం



అన్నదాత జాబేర్ బిన్ సాల్మన్ సన్మానిస్తున్న గురుస్వామి జయప్రకాష్

మైలార్‌దేవ్‌పల్లి: శివరాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1992-93వ విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల తమ సేవా నిరతిని చాటుకున్నారు. స్నేహబృందం అయ్యప్ప భక్తుల అన్న దానం (భిక్ష) కోసం ఆర్థిక సాయాన్ని అందజేశారు. కాటేదాన్ టీఎన్‌జీఓ కాలనీ అయ్యప్ప ఆలయంలో సోమవారం జరిగిన అన్నదాన కార్యక్రమంలో భక్తిశ్రద్ధలతో పాల్గొని అన్నదానం చేపట్టారు. దుబాయ్‌లో ఉద్యోగం చేస్తున్న స్నేహితుల్లో ఒకరైన జాబెర్ బిన్ సాల్మన్ కూడా తనవంతు ఆర్థిక వితరణను అందజేయడంతోపాటు అన్నదాన కార్యక్రమంలో పాల్గొని మతసామరస్యానికి ప్రతీకగా నిలిచారు. ఈ సందర్భంగా గురుస్వామి సంకూరి జయప్రకాష్ ఆయనను శాలువాతో సత్కరించారు. వరలక్ష్మి, సరిత, ఎన్.వరలక్ష్మీ, జాబేర్ బిన్ సాల్మన్ ఆర్థిక వితరణ చేయగా కార్యక్రమంలో మిగతా స్నేహితులైన సాయిబాబా, టి.నర్సింహా, మహేందర్, సత్యనారాయణ, లక్ష్మణ్ ప్రసాద్, చందు, జాస్మిన్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు



జీవితఖైదు పడిన శ్రీకాంత్

అత్తాపూర్: హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాంబాగ్‌లో జరిగిన వివాహిత హత్య కేసులో జీవిత ఖైదు, మూడు వేల రూపాయల జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు చెప్పింది. వివరాలివీ... రాంబాగ్‌లో జీవన్‌రావు, జ్యోతి(35) భార్యాభర్తలు నివసిస్తుంటారు. అదే ప్రాంతానికి చెందిన శ్రీకాంత్(30) 2019లో మహిళను దారుణంగా హత్య చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ మేరకు ఎల్‌బీనగర్ 4వ అడిషనల్ కోర్టులో న్యాయమూర్తి జె.కవిత నేరస్తుడికి జీవితఖైదు, రూ. 3 వేల జరిమానా విధిస్తు తీర్పు ఇచ్చారు. నేర విచారణలో భాగమైన పబ్లిక్ ప్రాసిక్యూటర్ టి.వెంకటేశ్వర ప్రసాద్, పరిశోధన అధికారి జి.సురేష్, ఇన్‌స్పెక్టర్, కోర్టు డ్యూటీ ఆఫీసర్‌లను ఉన్నతాధికారులు అభినందించారు.

అపోలో ఫార్మసీలో చోరీ

గచ్చిబౌలి: అపోలో ఫార్మసీలో చోరీ జరిగిన సంఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... గచ్చిబౌలి టెలికాంనగర్‌లోని అపోలో ఫార్మసీలోకి గుర్తు తెలియని దుండగులు ప్రవేశించి రూ. 2 లక్షల నగదు చోరీ చేశారు. ఫార్మసీ వెనుక భాగంలో ఉన్న కిటికీని తొలగించి లోపలికి ప్రవేశించారు. ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత చోరీ జరిగి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. సమీప ప్రాంతాలలో సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. అపోలో ఫార్మసీ నిర్వాహకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

తల్లి మందలించిందని.. క్వారీలో దూకి యువకుడి ఆత్మహత్య

గచ్చిబౌలి: క్వారీలో దూకి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన పరిధిలో ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. డ్యూటీ సరిగా చేయడం లేదని పనిలోంచి తీసివేయడంతో కన్నెటి దుర్గా ప్రసాద్(21) అనే యువకుడిని ఆయన తల్లి మందలించింది. దీంతో మసీద్‌బండ ఇంట్లో నుంచి ఈ నెల 7న చెప్పకుండా బయటకు వెళ్లాడు. అతని కోసం సమీప ప్రాంతాలలో వెతికినా అచూకీ లభ్యంకాలేదు. తండ్రి అప్పారావు గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేశారు. మసీద్‌బండలోని ఓ క్వారీ గుంతలో దుర్గా ప్రసాద్ ఓ మృతదేహం తేలిందని స్థానికులు సోమవారం గచ్చిబౌలి పోలీసులకు సమాచారం అందించారు. ఇంట్లో నుంచి వెళ్లిన రోజే మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహానికి ఉస్మానియా ఆస్పత్రిలో పోస్ట్‌మార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు దర్యాప్తులో ఉంది.

పెండింగ్ పనులను పూర్తి చేయండి



మున్సిపల్ చైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న కౌన్సిలర్

మణికొండ: నాలగో వార్డులోని పెండిగ్ పనులను సత్వరమే పూర్తి చేయించాలని కౌన్సిలర్ ఎల్.వందన నగేష్ ఆధ్వర్యంలో పలు కాలనీల ప్రజలు మున్సిపల్ చైర్మన్ కె. నరేందర్ ముదిరాజ్, కమిషనర్ డి.ప్రదీప్‌కుమార్‌లను కోరారు. సోమవారం వారు హుడాకాలనీలో పలు చోట్ల వరద నీరు చేరి ఇబ్బంది అవుతుందని, అంబేడ్కర్ పార్కులోని కమ్యూనిటీహాల్ మరో అంతస్తు నిర్మించాలని, అబ్దుల్ కలాం పార్కు, ఎంజీ పార్కుల పనులను కొనసాగించాలని, స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయాలని కోరారు. భాగ్యలక్ష్మి కాలనీలో సీసీ రోడ్లు వేయాలని, ఓపెన్ జిమ్ మరమ్మతులు చేపట్టాలని, కోతుల బెడదను పరిష్కరించాలని కోరారు. హుడా కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి ఈరన్న, ఉపాధ్యక్షుడు వాహీద్‌ఖాన్, కోశాధికారి వెంకటేశ్వరరావు, కార్యనిర్వాహక కార్యదర్శి పీఎస్ఎన్ మూర్తి, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి టి.రమేష్‌బాబు, భాగ్యలక్ష్మి కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాజలింగం, ప్రధాన కార్యదర్శి రాంచందర్, కోశాధికారి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన విశ్వవిద్యాలయంలో ఘనంగా 'దీక్షారంభ్'



దీక్షారంభ్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న అధికారులు

ఏజీవర్సిటీ: శ్రీకొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలోని ఉద్యాన కళాశాలలో బీఎస్సీ హార్టికల్చర్ మొదటి సంవత్సరం విద్యార్థుల కోసం సోమవారం దీక్షారంభ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఫస్ట్ ఇయర్ విద్యార్థుల్లో నైపుణ్యాల వృద్ధికి నూతన విద్యావిధానంలో చేర్చిన అంశాలను వివరించేందుకు చేపట్టిన ఈ కార్యక్రమాన్ని హార్టికల్చర్ విభాగం డీన్ డాక్టర్ రాజశేఖర్ ప్రారంభించారు. విద్యార్థులకు తరగతిలో చదువుతోపాటు ప్రాక్టికల్ పరిజ్ఞానాన్ని పెంపొందిస్తూ వారి సర్వతోముఖాభివృద్ధికి చేస్తున్న కృషిలో భాగమే ఈ దీక్షారంభ్ కార్యక్రమం అని ఆయన వివరించారు. విద్యార్థులు ఎప్పటికప్పుడు తమ స్కిల్స్‌ను అభివృద్ధి చేసుకోవాలని, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని సూచించారు. కాలానుగుణంగా హార్టికల్చర్ విభాగంలో వచ్చే ఆధునిక సాంకేతిక విధానాలను అందిపుచ్చుకొని రైతుల సంక్షేమానికి నిరంతరం కృషి చేయాలని సూచించారు. విద్యార్థులు ఉద్యాన విద్య తర్వాత సొంత వ్యాపారవేత్తలుగా ఎదిగే అవకాశాలు చాలా ఉన్నాయన్నారు. ప్రధానంగా మొక్కల నర్సరీల ఏర్పాటు, మొక్కల కుండీల తయారీ, పుట్టగొడుగుల పెంపకం, బయో పెస్టిసైడ్స్, ల్యాండ్ స్కేపింగ్ వంటి వాటిని స్థాపించి ఇతరులకు ఉపాధి అవకాశాలు కల్పించవచ్చని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కళాశాల అధికారులు, అసిస్టెంట్ ప్రొఫెసర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యమాన్ని మలుపు తిప్పిన కేసీఆర్ దీక్ష



పండ్లు పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు ధర్మారెడ్డి

రాజేంద్రనగర్: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ చేపట్టిన అమరణ నిరాహార దీక్ష తెలంగాణ మలి దశ ఉద్యమాన్ని మలుపు తిప్పిందని బీఆర్ఎస్ పార్టీ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు పోరెడ్డి ధర్మారెడ్డి అన్నారు. దీక్షా దివస్ కార్యక్రమంలో భాగంగా సోమవారం రాజేంద్రనగర్ డివిజన్ బుద్వేల్ భగవతిగూడలోని సెయింట్ అల్ఫోన్సా అనాథాశ్రమంలో పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా 2001 ఏప్రిల్ 27న గులాబీ జెండాను ఎగరవేసి మలి దశ ఉద్యమాన్ని మలుపు తిప్పిన మహనీయుడు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అని అన్నారు. స్వరాష్ట్ర కల సాకారానికి పునాది వేసిన 9-12-2009 రోజును రాష్ట్ర చరిత్రలో దీక్ష విజయ్ దివస్‌గా నిలిచిపోయిందన్నారు. కాంగ్రెస్‌కు తెలంగాణలో ఎందుకు అధికారం ఇచ్చామని ప్రజలు బాధపడుతున్నారన్నారు. ఉద్యమ నాయకులు ప్రీతంరాజ్, కావేలిగూడెం గిరిబాబు, దేవదాస్, నరేష్ ముదిరాజ్, నరేందర్‌రెడ్డి, టీఆర్ఎస్‌వీ అధ్యక్షుడు కట్టిలమండి గౌతమ్, సుల్తానా, యశోదమ్మ, శ్రీను, కాకా, వెంకటేష్, శివ, కిరణ్ పాల్గొన్నారు.

13న 'ఐయామ్ ఫినోమ్-24'



ఫినోమ్ అధ్యక్షుడు, సీఓఓ హరి బాయిరెడ్డి

గచ్చిబౌలి: ఐయామ్ ఫినోమ్-2024 పేరిట ఫ్లాగ్ షిప్ ఇంటలిజెంట్ ఎక్స్‌పీరియన్స్ కాన్ఫరెన్స్‌ను నిర్వహించన్నట్లు ఫినోమ్ అధ్యక్షుడు, సీఓఓ హరి బాయిరెడ్డి తెలిపారు. సోమవారం గచ్చిబౌలిలోని ఫినోమ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఏఐ దిగ్గజం ఫినోమ్ ఆధ్వర్యంలో ఈ నెల 13న మాదాపూర్‌లోని ట్రిడెంట్ హోటల్‌లో ఐయామ్ ఫినోమ్ పేరిట ఒక రోజు సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. టాలెంట్ ఎక్స్‌పీరియన్స్ ఇన్నోవేషన్‌కి అపార అవకాశాలున్నాయన్నారు. ప్రత్యేక శిక్షణ ద్వారా ఉద్యోగ నియామకం నుంచి రిటెన్షన్ వరకు సహకారం అందిస్తామన్నారు. హైదరాబాద్, విశాఖపట్టణం, బెంగళూర్‌తోపాటు దేశ వ్యాప్తంగా విస్తరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ట్రైడెంట్‌లో జరిగే సదస్సుకు దేశ వ్యాప్తంగా ఐటీ, హెచ్ఆర్ విభాగానికి చెందిన 600 మంది నిపుణులు పాల్గొంటారని చెప్పారు. కాన్ఫరెన్స్‌కు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు హాజరవుతారని తెలిపారు. టాప్ ఎంటర్‌ప్రైజెస్‌ల సక్సెస్, టాలెంట్ డెవలప్‌మెంట్, కేరీర్ పాత్ మ్యాపింగ్, ఏఐ డీప్‌డైవ్ సెషన్లు ఉంటాయన్నారు. ఏఐ ఆధారిత టెక్నాలజీ సంస్థల అవసరాలను తీర్చడంలో కీలకంగా మారుతుందన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

శేరిలింగంపల్లి: కాలనీలు, బస్తీల్లో ఏర్పాటు చేసే ఉచిత వైద్య శిబిరాలను పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ అన్నారు. శేరిలింగంపల్లి సురభికాలనీ ప్రైమరీ స్కూల్‌లో డాక్ ఆన్‌లైన్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించిన కార్పొరేటర్ రాగం మాట్లాడుతూ... ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించడం అభినందనీయం అన్నారు. ఎస్ఎంసీ చైర్మన్ బసవరాజు, వార్డు మెంబర్ శ్రీకళ, స్కూల్ హెచ్ఎం పాండురంగారెడ్డి, నాయకులు దేవదాస్, ఆశ్రఫ్, కొయ్యాడ లక్ష్మణ్‌యాదవ్, విష్ణువర్ధన్‌రెడ్డి, సురభికాలనీ అధ్యక్షుడు చంద్రశేఖర్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఏబీవీపీ గ్రేటర్ సదస్సు

రాయదుర్గం: అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) గ్రేటర్ హైదరాబాద్ సదస్సును మంగళవారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారని ఏబీవీపీ సెంట్రల్ యూనివర్సిటీల జాతీయ కన్వీనర్, హెచ్‌సీయూ శాఖ అధ్యక్షుడు బాలకృష్ణ తెలిపారు. ఈ సదస్సును నగరంలోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని ఠాగూర్ ఆడిటోరియంలో నిర్వహిస్తారన్నారు. సదస్సులో పెద్ద సంఖ్యలో ఏబీవీపీ నాయకులు, సభ్యులు పాల్గొనాలని ఆయన కోరారు. హెచ్‌సీయూ క్యాంపస్ నుంచి పెద్ద సంఖ్యలో ఏబీవీపీ నాయకులు, సభ్యులు సదస్సుకు తరలివెళ్లారన్నారు.

పార్కు స్థలాన్ని కాపాడాలని వినతి

శేరిలింగంపల్లి: కొండాపూర్ డివిజన్ అంజయ్యనగర్‌లోని పార్కు స్థలాన్ని కాపాడాలని జనం కోసం సంస్థ అధ్యక్షుడు కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు జీహెచ్ఎంసీ శేరిలింగంపల్లి వెస్ట్‌జోన్ జోనల్ కమిషనర్ కార్యాలయంలో సోమవారం వినతిపత్రాన్ని సమర్పించాచారు. 134, 135, 136 సర్వే నంబర్లలో పార్కు స్థలం ఉందని, ఈ స్థలంపై హైకోర్టులో రిట్ పిటిషన్ పెండింగ్‌లో ఉండగా దొంగ పట్టాలు, దొంగ రిజిస్ట్రేషన్లు, దొంగ అనుమతులను ఇచ్చి అంజయ్యనగర్ పార్కు కబ్జాకు కారుకులైన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొందరు భారీ ముడుపులతో అనుమతులు తీసుకొని నిర్మాణాలు చేస్తున్నారని ఆరోపించారు. జనం కోసం సంస్థ ఈ విషయంపై ఫిర్యాదు చేసినా నిర్మాణాలు సాగుతున్నాయని ఆరోపించారు. ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు వెంటనే చొరవ తీసుకొని స్థలాన్ని పరిశీలించి కబ్జాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

డాగర్‌తో సంచరిస్తున్న యువకుడి అరెస్ట్

చాంద్రాయణగుట్ట: డాగర్‌తో సంచరిస్తున్న యువకుడిని దక్షిణ మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీ అందె శ్రీనివాసారావు తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్రినాక ప్రాంతానికి చెందిన జి.అజయ్ కుమార్(30) మూడు నెలల క్రితం ఆన్‌లైన్‌లో రూ.1600లు వెచ్చించి డాగర్‌ను కొనుగోలు చేశాడు. అప్పటి నుంచి తన స్నేహితుల బర్త్‌డేలకు హాజరై డాగర్‌ను కేక్ కట్ చేసి, వీడియోలు తీసుకొని ఫేస్‌బుక్‌లో అప్‌లోడ్ చేస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం డాగర్‌తో అనుమానాస్పదంగా సంచరిస్తుండడంతో విశ్వసనీయ సమాచారం అందుకున్న దక్షిణ మండలం టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, ఛత్రినాక పోలీసులు సంయుక్తంగా దాడులు చేసి అతన్ని అరెస్ట్ చేశారు. డాగర్, సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు.

తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు తరలిన మహిళలు



బండ్లగూడలో బస్సులను ప్రారంభిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ సభకు సోమవారం మహిళలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా మధ్యాహ్నం బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 22 డివిజన్ల నుంచి 20 బస్సుల్లో సుమారు వెయ్యి మంది మహిళలు తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారని తెలిపారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గంధ భరితంగా ప్రధాన రోడ్లు



చెత్త కుప్పలతో అపరిశుభ్రంగా మారిన రోడ్డు



మణికొండ: మణికొండ మున్సిపల్ కేంద్రం నుంచి ఔటర్ సర్వీసు రోడ్డుకు చేరుకునే ప్రధాన రోడ్లన్నీ దుర్గంధ భరితంగా తయారయ్యాయి. నిత్యం వేలాది వాహనాల్లో రాకపోకలు సాగించే ప్రయాణికులు ఆయా రోడ్లకు ఇరువైపులా వేసిన చెత్తాచెదారం ఇతర వ్యర్థాల నుంచి వచ్చే దుర్గంధాన్ని భరించలేకపోతున్నారు. రోజూ మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు అటువైపు రాకపోకలు సాగిస్తున్నా పట్టించుకోవటం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. మణికొండ ల్యాంకోహిల్స్ జీ-సర్కిల్ నుంచి ఔటర్ సర్వీసు రోడ్డు, పుప్పాలగూడ బీరప్ప దేవాలయం నుంచి ఔటర్ సర్వీసు రోడ్డుకు మధ్య కనెక్టింగ్ రోడ్డు ప్రారంభించారు. దాంతో ఐటీ ఉద్యోగులతో పాటు ఇతర పనులపై వెళ్లే వారు ఈ రోడ్డుపై రాకపోకలు సాగిస్తున్నారు. సదరు రోడ్లకు ఇరువైపులా మొక్కలను నాటే కార్యక్రమాన్ని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ప్రారంభించారు. వాటిని నాటినా ఆలనా, పాలనా లేకపోవటంతో అవన్నీ ఎండిపోయాయి. దాంతో రోడ్లకు ఇరువైపులా రాత్రి సమయాల్లో చెత్త, నిర్మాణ వ్యర్థాలను గుర్తు తెలియని వ్యక్తులు తెచ్చి పారబోస్తున్నారు. దాంతో ఆయా రోడ్లు డంపింగ్ కేంద్రాలుగా మారిపోయాయని, అటువైపుగా మణికొండలోకి వచ్చే వారు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ఇకనైనా మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే అక్కడ పేరుకుపోయిన చెత్తను తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. అక్కడ చెత్త వేయకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

బెదిరింపులకు పాల్పడిన ఇద్దరి అరెస్టు



పోలీసులు అరెస్టు చేసిన నిందితులు

మణికొండ: ఓ ఫంక్షన్ హాల్‌ను తమ అనుచరులతో కలిసి కూల్చివేయటం, అద్దెకు ఉంటున్న వారితో పాటు వాచ్‌మెన్‌ను బెదిరించి దోపిడీ యత్నం చేసిన ఇద్దరిని నార్సింగి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి సమాచారం మేరకు... హైదర్‌షాకోట్‌లోని సాయిరాంనగర్ కాలనీలో ఉన్న ఏపీడీ ఫంక్షన్‌హాల్ స్థలాన్ని అహల్యసింగ్ లీజుకు తీసుకున్నారు. ఆదివారం దాన్ని ఖాళీ చేయాలని గంధంగూడకు చెందిన హరీష్‌గౌడ్, సాయిరాం కాలనీకి చెందిన రాంప్రసాద్‌రావులు వారిపై దౌర్జన్యం చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేసి సోమవారం రిమాండ్‌కు తరలించారు. నిందితులతో పాటు వారి అనుచరులు కొంత మంది ఉన్నారని వారిని గుర్తించి అరెస్టు చేస్తామని సీఐ తెలిపారు. చట్ట విరుద్ధంగా ఇలాంటి కార్యక్రమాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకుంటామని, బాధితులు తమను సంప్రదించాలన్నారు.

జీఎన్ఐటీఎస్‌లో 'అటల్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ప్రారంభం



గోల్కొండ: షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో అటల్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ సోమవారం ప్రారంభమైంది. రెండు వారాల పాటు జరిగే జాతీయ స్థాయి కార్యక్రమంలో ఎన్‌హాన్సింగ్ డయగ్నొస్టిక్ ప్రెషిషన్, డీప్ లర్నింగ్ పవర్స్, ఇంటలిజెంట్ సిస్టమ్ ఫర్ రెటీనా, అక్లూజన్ డయగ్నొస్టిక్ తదితర అంశాలపై జరుగుతున్న ఈ జాతీయ స్థాయి కార్యక్రమంలో కంటి సంబంధిత నిపుణులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ కె.రమేష్‌రెడ్డి అధ్యక్షత వహించారు. డాక్టర్ జి.మాలినిదేవి, డాక్టర్ డి.వి.ఎల్.పరమేశ్వరి, వై.శ్రావణిదేవి, అటల్ ఎఫ్‌డీపీ ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి చెందిన రత్నం పాల్గొన్నారు.